ఓం నమో భగవతే శ్రీ రమణాయ



# రమణ భాస్కర



వ్యవస్థాపక సంపాదకులు : బి.వి.ఎల్.ఎన్.రాజు

సంపుటి : 22 | సంచిక : 5 | జనవరి 2017

రమణ భాస్కర

ఆధ్యాత్మిక మాస పత్రిక

పేజీలు : 24

గౌరవ సంపాదకులు

శ్రీమతి P.H.V. సత్యవతి (హైమ)

చందా

సంవత్సర చందా:రు॥ 150/-

విడి ప్రతి : రు॥ 12/-

చిరునామా

రమణ భాస్కర

శ్రీ రమణ క్షేత్రం,

జిన్నూరు – 534 265

ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥

పబ్లిషర్

సద్గురు శ్రీ నాన్నగారు

శ్రీ రమణ క్షేత్రం

జిన్నూరు – 534 265

☎ 08814 - 224747

9247104551

ఈ సంచికలో....

17-01-1988

నేరేడుమిల్లి

ప్రింటర్

శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్

(దుడే శ్రీను) ఎస్.వి.ఆర్. కాంప్లెక్స్,

పాలకొల్లు, 9848716747

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 17-01-1988, నేరేడుమిల్లి)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా!

సర్వసాధారణంగా మనం ఏమనుకొంటాము అంటే మనం గృహస్థాశ్రమంలో ఉన్నాము, మనం సాధన చెయ్యగలమో చెయ్యలేమో, సత్యానుభవం పొందగలమో పొందలేమో అని ఇలా అనుకొంటూ ఉంటాము. దీనికి భగవాన్ ఏమన్నారు అంటే గృహస్థాశ్రమంలో ఉండికూడా మీరు తరించవచ్చును అని రమణగీతలో భగవాన్ చెప్పారు. ఎవరిపనులు వారు చేసుకొంటూ, ఈ ఆధ్యాత్మిక సాధన చేసుకొంటూ, మీరు సమాజానికి కూడా ఉపకారం చెయ్యవచ్చును, అంతేకాదు మీరు తరించవచ్చును, ఈ అవకాశం గృహస్థాశ్రమంలో ఉంది అని స్వామి చెప్పారు. గృహస్థాశ్రమం విడిచిపెట్టేసి ఇంకొక ఆశ్రమం మార్చుకొంటే ఏదో తెలుస్తుందని ఇలా భ్రాంతిపడొద్దు. గృహస్థాశ్రమంలో ఉండికూడా మీరందరూ తరించవచ్చు. ఇందులో సందేహం పెట్టుకోవద్దు. ఇందులో కొంతమంది రమణమహర్షి భక్తులు ఉండవచ్చు, రాముడి భక్తులు ఉండవచ్చు, కృష్ణుడి భక్తులు ఉండవచ్చు, సాయి భక్తులు ఉండవచ్చు, ఏసుక్రీస్తు భక్తులు ఉండవచ్చు, అల్లాభక్తులు ఉండవచ్చు, మీరందరూ రకరకాలుగా ఉండవచ్చును. సోదరమహాశయులారా! ఒకటి మటుకు జ్ఞాపకం పెట్టుకోండి. భగవంతుడిని తెలుసుకోవటం అంటే మిమ్మల్ని మీరు తెలుసుకోవటం. రాముడిని తెలుసుకొందాము, కృష్ణుడిని తెలుసుకొందాము, రమణమహర్షిని తెలుసుకొందాము అని మీకు అనిపిస్తోంది అదికాదు. మిమ్మల్ని మీరు తెలుసుకోవటమే మోక్షం. మీరు ఏ సాధన చేసినప్పటికీ మిమ్మల్ని మీరు తెలుసుకోవాలి, అదే మీ గమ్యం.

మిమ్మల్ని మీరు తెలుసుకోరు అనుకోండి. మీకు దేవుడు తెలిసినా అది మానసిక దృశ్యం మాత్రమే. మిమ్మల్ని మీరు తెలుసుకోలేకపోతే మీరు దేవుడిని తెలుసుకోలేరు. సరే మమ్మల్ని మేము తెలుసుకొంటాము దాని వలన మాకు కలిసివచ్చేది ఏమిటి అని మీరు అడుగవచ్చు. మీరు నిద్రలో సుఖంగా ఉంటున్నారు కదా. గాఢనిద్రలో మీరు ఎంత సుఖంగా ఉంటున్నారో మిమ్మల్ని మీరు తెలుసుకొంటే జాగ్రదావస్థలో కూడా మీరు అంత సుఖంగా ఉండగలరు. నిద్రలో ఎవరికయినా ఏమైనా బాధలు ఉన్నాయా చెప్పండి? నిద్రలో ఎవరికి ఏ బాధలు లేవు, సుఖంగా ఉన్నారు, శాంతిగా ఉన్నారు. నిద్రలో మీరు ఎంత సుఖంగా ఉన్నారో, ఎంత శాంతిగా ఉన్నారో మిమ్మల్ని మీరు తెలుసుకొంటే ఈ జాగ్రదావస్థలో కూడా అంత శాంతిగా ఉండవచ్చు. మీరు ఏ మంత్రం చేసుకోండి. ఏ దేవుడిని ఆరాధించండి, ఏ గురువును ఆశ్రయించండి. ఇవన్నీ కూడా ఒకేచోటికి తీసుకొనిపోతాయి. అదే మిమ్మల్ని మీరు తెలుసుకోవటం. మీరు ఏ దేవుడిని ఆరాధించినా, ఏ గురువును ఆరాధించినా, ఏ సాధన చేసినా మీరు ఎవరో మీకు తెలియకపోతే అది అంతా ఒకటిలేని సున్నలతో సమానము.

ఉన్నది ఒకటే వస్తువు. అది మన హృదయంలోనే ఉంది. మనం దానికి వేరుగా లేము. అది మనమై ఉన్నాము. అది మీకు తెలిస్తే, హృదయంలో ఉన్న సత్యవస్తువు కనుక మీకు అనుభవంలోనికి వస్తే అదే మీ కడసారిజన్మ. హృదయంలో ఉన్న సత్యవస్తువును దర్శించినవాడు మాత్రమే ఈ మాయాజాలంనుండి బయటపడతాడు. నేను చెప్పేది ఇరుకు మార్గంకాదు. ఈ దేవుడిని ఆరాధించండి లేకపోతే ఈ మంత్రాన్నే జపించండి మీకు వస్తుంది లేకపోతే రాదు అని చెప్పేటటువంటి ఇరుకుపద్ధతులు నేను చెప్పటం లేదు. మీకు ఎన్నో సంపదలు ఉన్నాయి అనుకోండి, మీకు అన్నీ అనుకూలపరిస్థితులు ఉన్నాయి అనుకోండి అయినా మీకు శాంతిలేదు, కుదురులేదు అనుకోండి ఇంక మీకు మోక్షం లేదు. మీ మనస్సుకు శాంతి లేనప్పుడు మీకు ఎన్ని ఉంటే మాత్రం ఏమిటి ప్రయోజనం. రమణమహర్షి గారు ఒక చక్కటి మాట చెప్పారు. ఇప్పుడు మీరు మోక్షంలో లేకపోతే, మీరు ఏదో ప్రయత్నం చెయ్యటం వలన కనుక నిజంగా మోక్షంవస్తే, ఆ మోక్షం కోసం మీరు ప్రయత్నం చెయ్యటం అనవసరం అని చెప్పారు. ఇప్పుడు మీరు మోక్షంలో లేరు అనుకోండి, మీరు చేసే పూజ వలన, జపం వలన మోక్షం వస్తుంది అనుకోండి, అటువంటి మోక్షాన్ని పొందటం అనవసరం అన్నారు. మోక్షం ఇప్పుడూ ఉంది, అది సదా ఉంది, అది మీ హృదయంలో ఎప్పుడూ ప్రకాశిస్తోంది. కాలం కూడా నిజంకాదు, కాలాన్ని చూసి మోహపడకండి, కాలం కూడా మనస్సు యొక్క కల్పితమే. శరీరం ఉన్నవాడికి లోకం, ఈ శరీరం లేనివాడికి లోకం లేదు.

మనస్సు లేనివాడికి శరీరం లేదు. తొందరపడకండి, బాగా అర్థంచేసుకోండి. ఈ నేరేడుమిల్లిలో ఒకడు ఉన్నాడు. వాడికి శరీరం పోయింది అనుకోండి, ఇంకవాడికి నేరేడుమిల్లితో ఏమైనా పని ఉందా? వాడికి కోటా బియ్యం కావాలా? దేహం ఉన్నవాడికే లోకం, దేహం లేనివాడికి లోకంతో పనేముంది? ఇంటితో పని ఏముంది? బియ్యంతో పని ఏముంది? బట్టలతో పని ఏముంది? మనస్సు లేనివాడికి దేహంతో పని ఏముంది? మనస్సును బట్టి శరీరం వచ్చింది. మరి మనస్సు ఎక్కడ నుండి వస్తోంది? మనం నేను, నేను అంటాము కదా! ఈ నేను అనే బుద్ధి అందరికీ ఉంది. ఎంత తెలివైన వాళ్ళకైనా, ఎంత మొద్దబ్బాయికైనా ఈ నేను అనే బుద్ధి ఉంది. అది లేని వాళ్ళు ఎవరూ లేరు. ఈ నేను అనే బుద్ధి హృదయంలో నుండి వస్తోంది, ఇదే మనస్సు. అంటే హృదయంలోనుండి మనస్సు వస్తోంది, మనస్సులోనుండి శరీరం వస్తోంది. శరీరం ఉన్నవాడికి లోకం ఉంది, అంటే హృదయంలో నుండి ఇది అంతా వస్తోంది.

హృదయంలోనే ఆత్మ ఉంది, హృదయంలోనే దేవుడు ఉన్నాడు, ఒకవేళ మీకు బయట దేవుడు కనిపించినా వాడు నిజం కాదు, వాడు దృశ్యమే, లోకం ఏ విధంగా అయితే మనస్సుకు దృశ్యమో, ఆ కనిపించే దేవుడు కూడా మనస్సుకు దృశ్యమే, ఆ దృశ్యం ఎప్పటికయినా అదృశ్యం అయిపోతుంది. హృదయంలో ఆత్మ ఉంది, శాంతి ఉంది అని మీరు చెపుతున్నారు, మాకు తెలుసుకోవాలని ఉంది, దానికోసం ప్రయత్నం చేస్తున్నాము కాని మాకు తెలియటం లేదు అని ఒకరు భగవాన్‌ను అడుగుతున్నారు. మన సమస్య కూడా అదే. మనకు తెలుసుకోవాలని ఉంది కాని తెలియటం లేదు. ఎవరిని తెలుసుకోవాలని ఉంది? మనల్ని మనమే తెలుసుకుంటున్నాము. నిన్ను నువ్వు తెలుసుకో అంటే ప్రతీవాడూ కంగారు పడుతున్నాడు. వాడ్ని వాడినే తెలుసుకో మంటున్నాము కాని ఎదుటివాడిని తెలుసుకోమంటున్నామా? ఇతరులను తెలుసుకోమని భగవాన్ చెప్పటం లేదు. మీ తెలివితేటలను ఉపయోగించి మిమ్మల్ని మీరు తెలుసుకోండి అని చెపుతున్నారు. మనం ఏమి చేస్తున్నాము అంటే ఎదుటివారిలో ఉన్న లోపాలను తెలుసుకోవటానికి ప్రయత్నం చేస్తున్నాము. మీ తెలివితేటలను ఖర్చుపెట్టి మీలో ఉన్న లోపాలను సవరించుకోండి. మిమ్మల్ని మీరు తెలుసుకోండి అని రమణస్వామి చెపుతున్నారు.

మిమ్మల్ని మీరు తెలుసుకోండి అని చాదస్తంగా ఎన్నిసార్లు ఇలా చెపుతారు, ఎన్నిసార్లు ఆ బ్రహ్మాస్త్రం నా మీద విడిచిపెడతారు. మీరు చెప్పేది అంగీకరిస్తున్నాము, నాకూ తెలుసు కోవాలనే ఉంది కాని తెలుసుకోలేకపోతున్నాను అంటే అప్పుడు భగవాన్ ఏమి చెప్పారు అంటే ఒకడు ప్రవాహంలో కొట్టుకొనిపోతున్నాడు. మనకు తెలుసుకోవాలనే బుద్ధి కలిగినట్లే

వాడికి ఒడ్డుకు రావాలనే బుద్ధి కలిగింది. ఈత వచ్చును, ఒడ్డుకు రావాలని ఉంది కాని గట్టు మీద ఉన్న కుర్రవాళ్ళు పెద్దపెద్ద రాళ్ళు పెట్టి కొడుతూఉంటే ఆ దెబ్బలు భరించలేక మరల ప్రవాహంలోనికి వెళ్ళిపోతున్నాడు. మన పరిస్థితి అలాగే ఉంది అన్నారు రమణమహర్షి. అంటే ఏమిటి? మనం మాయ అనే ప్రవాహంలో, జననమరణ ప్రవాహంలో కొట్టుకొని పోతున్నాము. బయటకు రావాలి అని ప్రయత్నం చేస్తున్నాము, సాధన చేస్తున్నాము. కాని గట్టుమీద ఉన్న కుర్రవాళ్ళు ఒడ్డుకి వచ్చేవాడిని ఏ విధంగా అయితే రాళ్ళు పెట్టి కొడుతున్నారో మనలో ఉన్న సంస్కారాలు, వాసనలు, జననమరణ ప్రవాహంలోనుండి మనం బయటకు రాకుండా అడ్డు పడుతున్నాయి. మనం హృదయంలోనికి వెళ్ళటానికి ప్రయత్నం చేస్తున్నాము. కాని మన కోరికలు, వాసనలు, సంస్కారాలు మన ప్రయత్నాన్ని విఘ్నం చేస్తున్నాయి. మనం హృదయంలోనికి దిగలేకపోతున్నాము అంటే దానికి మన వాసనలే కారణం, మన సంస్కారాలే కారణం, మన కోరికలే కారణం.

మీరు కౌరవులు, పాండవుల కథలను చదివిఉంటారు. కౌరవులకు పాండవులకు ఎన్నో పేచీలు ఉండేవి. వాళ్ళు నిరంతరం పేచీలతో ఉంటే ధృతరాష్ట్రుడికి దుఃఖం, అశాంతి వచ్చేవి. ఒకసారి ఆయనకు ఆధ్యాత్మిక శాస్త్రం తెలుసుకోవాలనిపించింది. ఏదయినా ఒక విద్య నేర్చుకోవటానికి శాస్త్రం యొక్క సహాయం, గురువు యొక్క సహాయం, ప్రయత్నం అవసరము. గురువు ముఖతా విషయం వింటే దాని లోతులు తెలుస్తాయి. మనం ప్రయత్నం చేయాలి, కాలం కలిసివచ్చేవరకు ఓపిక పట్టాలి. నాకు తత్వశాస్త్రం వినాలని ఉంది, ఎవరయినా మహాత్ములచేత చెప్పించమని ధృతరాష్ట్రుడు విదురుడిని అడిగాడు. విదురుడు తన తపస్సు యొక్క శక్తి చేత మనస్సులో ప్రార్థించి బ్రహ్మమానసపుత్రుడయిన సనత్సుజాతుడిని అక్కడ దర్శనం యిచ్చేలా చేసాడు. ధృతరాష్ట్రుడు సనత్సుజాతుడిని అడిగిన ప్రశ్న ఏమిటి అంటే మరణం అనేది ఉందా, లేదా? దానికి సనత్సుజాతుడు ఏమని చెప్పాడంటే మరణం ఉంది, మరణంలేదు. దేహమాత్రుడినే నేను అనుకొనేవాడికి మరణం ఉంది. మరణం లేని వస్తువు ఒకటి ప్రతీవాడి హృదయంలోనూ ఉంది. అదే ఆత్మ, అదే చైతన్యం, అదే భగవంతుడు, అదే ప్రకాశం, దానికి మరణంలేదు, అది ఎందుకు మరణించదు అంటే అది పుట్టలేదు కాబట్టి దానికి మరణంలేదు. శరీరం పుట్టింది కాకబట్టి ప్రతీవాడి శరీరం మరణిస్తుంది. అంటే శరీరం నేను అనుకునే వాడికి ఆ శరీరం మరణిస్తుంది కాబట్టి వాడికి మరణం ఉంది. శరీరం జీవించి ఉండగానే తన హృదయంలో ఉన్న ఆత్మను తెలుసుకొన్నవాడు ఆత్మ అవుతాడు, ఆత్మకు మరణం లేదు కాబట్టి వాడికి మరణం లేదు అని చెప్పాడు. మరణించిన వాడు తప్పనిసరిగా తిరిగి జన్మిస్తాడు

మరణంలేని వాడికి జన్మతో పనిలేదు. అందుచేత ఈ శరీరంలో ప్రాణం ఉండగానే నువ్వు మరణం లేని వస్తువును తెలుసుకొంటే ఇంక నీకు మరణం లేదు, మరల జన్మకు నువ్వు రానక్కరలేదు. ఆత్మను తెలుసుకోవటానికే ఈ "నేను ఎవడను" అనే ప్రశ్న.

నాకు రోజూ కోపం వస్తోంది, చిరాకు వస్తోంది, ఇష్టం వస్తోంది, కొంతమందిని ప్రేమిస్తున్నాను, కొంతమందిని ద్వేషిస్తున్నాను. ఈ కోపం వచ్చే నేను ఎవడు? కొంతమందిని ప్రేమించి, కొంతమందిని ద్వేషించే ఈ నేను ఎవరు? నాకు గొప్పలు కావాలి అనుకొనే ఈ నేను ఎవరు? రాగద్వేషాల కూడా పడి ప్రాకులాడే ఈ నేను ఎవరు? మీ పేరు ఏమిటి అని అడిగితే రామరాజు అంటారు. అంటే రామరాజు అనేది ఈ నేనుకు పేరా లేక దేహానికి పేరా? అసలు ఈ నేనుకు పేరు ఉందా? మనకు కోపం వస్తోంది ఏదో లడ్డూ, రొట్టిముక్కో పెడితే తగ్గిపోతుంది, కూతురికి తల్లి మీద కోపం వచ్చింది అనుకోండి, ఏదో నాలుగు చీరలు కొని పెడితే ఆ కోపం తగ్గిపోతుంది, చిన్నపిల్లలకు వస్తే వాళ్ళకు బఠానీలు, శనగలు పెడితే వాళ్ళకు కోపం తగ్గిపోతుంది. ఇవి నిలబడే టిక్కెట్లు కాదు. ఇవన్నీ తగ్గిపోతున్నప్పటికీ ఎన్నో భావాలు వస్తున్నాయి, వెళ్ళిపోతున్నాయి. మీకు ఉదయం అనేక భావాలు వస్తున్నాయి, మధ్యాహ్నం అనేక భావాలు వస్తున్నాయి, సాయంత్రం అనేక భావాలు వస్తున్నాయి. ఇలా భావాలు వస్తున్నాయి, వెళ్ళిపోతున్నాయి. కాని నేను అనే తలంపు మటుకు కామన్‌గా ఉంటోంది. ఇది మీరు గ్రహించండి. ఆదర్శాలు మారతాయి, ఆశయాలు మారతాయి, కోరికలు మారతాయి కాని ఈ నేను అనే తలంపు మటుకు కామన్‌గా అలాగే ఉండి పోతోంది. కామన్‌గా ఉండే ఆ నేను అనే తలంపును పట్టుకొని దాని మూలస్థానానికి మీరు వెళ్ళండి. జాగ్రదవస్థలో ఉన్నంతసేపు అది మిమ్మల్ని పట్టుకొనే ఉంటోంది అది ఎవరు? అది ఎక్కడ నుండి వస్తోంది? దాని పుట్టుక స్థానం ఏది? అని దాని గురించి మీరు అన్వేషించాలి. దాని మూలం, దానియొక్క సోర్సు మీకు తెలిస్తే అప్పుడు దేవుడు ఎవరో మీకు తెలుస్తుంది.

సోదరమహాశయులారా! ఇప్పుడు మనందరకు సుఖపడాలని ఉంది. కాని మనం చేసే ప్రయత్నం ఎలా ఉంది అంటే మన ఉద్దేశ్యం పాలకొల్లు వెళ్ళాలని కాని దొడ్డిపట్ల వెళ్ళేకారు ఎక్కేస్తాము. మనం దొడ్డిపట్ల వెళతాము కాని పాలకొల్లు వెళ్ళలేము. మనం చేసే సాధనలు అలా ఉన్నాయి. మనందరకు సుఖం కావాలి కాని ఎవరికి దేవుడు అక్కరలేదు, సమాజం అక్కరలేదు. సుఖం కావాలి అంటే డబ్బు కావాలి, డబ్బు లేకపోతే సుఖం ఎలా వస్తుంది అనుకొంటాము. డబ్బు సంపాదిస్తే సుఖం రాదు. భోగం వస్తుంది. భోగం అనుభవించేకొలదీ అది రోగానికి కారణం అవుతుంది, చివరకు దుఃఖం మిగులుతుంది. డబ్బు పెట్టి సుఖాన్ని

కొనుక్కోందామని మన ప్రయత్నం కాని చివరకు మన డబ్బే మన దుఃఖానికి కారణం అవుతుంది. నేను చెప్పే ఈ మాటలు మీకు చేదుగా ఉండవచ్చు కాని ఈ జన్మలో కాకపోయినా, మరుసటి జన్మలో కాకపోయినా, ఇంకో జన్మలో అయినా ఎప్పడో ఒకప్పడు మీకు ఉపయోగపడతాయి అని నేను మీకు చెపుతున్నాను. మనం శారీరకంగా ఎంత బలంగా ఉన్నప్పటికీ,మరణం వస్తోంది అంటే మనకు భయం వేస్తే మనకు బలం లేనట్లే లెక్క. మనం ఇంట్లో ఒకచోట పెట్టే వస్తువులను ఇంకోచోట పెడతాము. వాటికోసం వెతుక్కుంటూ ఉంటాము, చిరాకుగా ఉంటాము. దీనికి మనలో ఉన్న కోపమే కారణం. ఒక క్రమస్థితిలో మనం ఉండలేకపోతున్నాము అంటే దానికి మనలో ఉన్న కోపమే కారణం. అది మనకు తెలియదు.

నేను యొక్క మూలాన్ని, నేను యొక్క స్వరూపాన్ని గృహస్థాశ్రమంలో ఉండికూడా మీరు తెలుసుకోవచ్చు. ఈ నేను ఎవడో తెలుసుకోవటం ముఖ్యం. ఈ నేను ఎవడో తెలుసుకోవటానికి మీకు మంత్రం సహాయం చేస్తూఉంటే మంత్రజపం చేయండి, భగవద్గీత పారాయణం సహాయం చేస్తే భగవద్గీత చదవండి, మీరు చేసే యాత్రలు సహకరిస్తే యాత్రలు చేయండి, మీరు చేసే ధర్మం సహకరిస్తే ధర్మం చేయండి, విగ్రహారాధన ఉపయోగపడితే విగ్రహారాధన చెయ్యండి. మీరు ఏది చేసినప్పటికీ మీరు చేసే పనులన్నీ కూడా ఈ నేను ఎవడో తెలుసుకోవటానికి సహకరిస్తూ ఉండాలి. సత్సంగం, సంకీర్తన ఇవి మీరు జ్ఞాపకం పెట్టుకోండి. ఇప్పడు ఇది సత్సంగం. మీరు రామ నామమో, కృష్ణ నామమో, అరుణాచల శివ నామమో చేస్తారనుకోండి, అది సంకీర్తన. ఈ సత్సంగం, సంకీర్తన కూడా నేను ఎవడనో తెలుసుకోవ టానికి మీకు సహకరించకపోతే అవి ఒకటి లేని సున్నలతో సమానము. ఒకవేళ వాటి వలన పుణ్యం వచ్చినా అది అనుభవిస్తే పోతుంది. మీరు ఏ యూనివర్సిటీలో చదివినా భారతీయవిద్య యొక్క ఎసెన్స్ ఏమిటి అంటే సత్యం, శివం, సుందరం. మీరు చేసే పని సత్యముగా ఉండాలి, మంచితనంగా ఉండాలి, సుందరంగా ఉండాలి. అందుచేత సత్సంగం, సంకీర్తనల యొక్క ప్రయోజనం సత్యాన్ని తెలుసుకోవటమే. సత్యం ఎవరు అంటే అది నువ్వే అది నీకు బయటలేదు, యు ఆర్ దట్, అది నీవై ఉన్నావు.

నువ్వు ఏ సత్యాన్ని తెలుసుకోవాలనుకొంటున్నావో అది నీకు వేరుగా లేదు, అది నీకు బాహ్యంగా లేదు. అది నువ్వే. మన మనస్సు దగ్గర గొప్ప విషయం ఏమిటి అంటే బయట విషయాలను తెలుసుకోమంటే ఎంతదూరం అయినా పరుగెడుతుంది, అమెరికా వెళ్లమంటే వెళ్లిపోతుంది, ఏ విషయమైనా తెలుసుకోమంటే తెలుసుకొంటుంది కాని నిన్ను

నువ్వు తెలుసుకో అని మనస్సును అడిగితే తెలుసుకోదు. ఎందుచేతనంటే నిన్ను నువ్వు తెలుసుకొంటే సత్యం ఏమిటో తెలుస్తుంది, సౌందర్యం ఏమిటో తెలుస్తుంది. అంతకుమించి నువ్వు చెయ్యవలసిన పని ఏమీ లేదు. అద్వైతస్థితి పొందినవాడికి ఆనందం ఏమిటండీ, వాడు ఆనందమయకోశాన్ని దాటి వెళ్ళిపోతాడు. నాకు ఆనందం కావాలి, శాంతి కావాలి అని అడిగేవాడు కూడా అక్కడ రాలిపోతాడు. మీరు మోక్షంకోసం ఎక్కడికి వెళ్ళకండి. ఎప్పుడైతే మిమ్మల్ని మీరు తెలుసుకోవటానికి ప్రయత్నం చేస్తున్నారో, మీ హృదయం యొక్క లోతులలోనికి మీరు ఎప్పుడైతే దిగుతున్నారో మోక్షం వచ్చి మీ వెంట పడుతుంది. జ్ఞానం సంపాదించాలంటే మీరు పని విడిచిపెట్టనక్కరలేదు. కర్తృత్వం లేకుండా, అహంకారం లేకుండా మీరు పని చేస్తూ ఉంటే అది పని కాదు, అదే పూజ. అహంకారం లేకుండా అన్నం తింటే అది అన్నంకాదు, అది ప్రసాదం. లోకంలో ఉన్న అశాంతికి, దుఃఖానికి, అన్ని గొడవలకు కూడా అహంకారమే కారణం. అహంకారం యొక్క మూలం తెలుసుకోవటం అంత సామాన్యం కాదు. దీనిమూలం తెలుసుకోవాలంటే స్వప్రయత్నం ఉండాలి, ఈశ్వరానుగ్రహం ఉండాలి. ఇది జీవుడిని సృష్టించింది, లోకాన్ని సృష్టించింది, దేవుడిని సృష్టించింది. అన్ని సృష్టించిన ఈ అహంకారం అంత తొందరగా మనకు లొంగుతుందా? మీరు మేడలు మిద్దెలు కట్టవచ్చు, వందలాది ఎకరాలు కొనవచ్చు, బ్యాంకు ఎక్కౌంట్లు పెంచుకోవచ్చు, ఇలా ఎన్ని సాధించినప్పటికీ నేను గొప్పవాడిని అని మీరు ఎవరూ అనుకోవద్దు. మీరు ఎప్పుడు గొప్పవారు అవుతారు అంటే మీతోటి మీరు పోరాడి మీ అహంకారాన్ని జయించగలిగితే అప్పుడు మీరు గొప్పవారు అయినట్లు. ఏనుగు నడుస్తూ ఉంటే కింద చాలా చీమలు చచ్చిపోతాయి. అబ్బా నేను ఎన్ని చీమలను చంపాను అని ఏనుగు అనుకోదు. ఏ సింహంతోటో పోరాడి జయించినప్పుడు నేను ఎంత గొప్పదాన్నో అని ఏనుగు అనుకోవచ్చు. అలాగే మీరు అహంకారంతో పోరాడి దానిని జయించండి. అప్పుడు మీ గొప్పతనం చూపించండి. నేను రాముడి భక్తుడిని, నేను భగవాన్ భక్తుడిని, నేను బాబా భక్తుడిని అని చెప్పేవాళ్ళేగాని నా మనస్సు స్వాధీనంలో ఉంది, నా యింద్రియాలు స్వాధీనంలో ఉన్నాయి అని చెప్పగలవాడు ఎవడో చెప్పండి. నేను ఆ భక్తుడిని, ఈ భక్తుడిని అని చెప్పటమే కాని వాడి మనస్సు వాడి స్వాధీనంలో ఉందా?

మీ దుఃఖానికి కారణం ఏమిటి? అబ్బా ఎన్ని జన్మల నుండి దుఃఖపడుతున్నాను. ఈ దుఃఖానికి కారణం ఎక్కడో బయట ఉంది అనుకొన్నాను. ఈ దుఃఖానికి కారణం ఏమిటో ఈ రోజునే నాకు తెలిసింది. ఈ దుఃఖానికి కారణం లోపలే ఉంది. ఈ మనస్సే

దుఃఖానికి కారణం. మనస్సు యొక్క మూలం తెలిసాక తెలిసింది నాకు, ఈ మనస్సు వల్ల ఇప్పటివరకు ఎంత దుఃఖపడ్డాను, ఎన్ని జన్మలకు గురి అయ్యాను, ఇప్పటికి ఈ దొంగ దొరికాడు. ఈ దొంగ ఎక్కడో బయట ఉన్నాడు అనుకొన్నాను. కానీ వీడు లోపలే ఉన్నాడు అన్నాడు జనకమహారాజు. ఆ దేవుడు గొప్పవాడు ఈ దేవుడు గొప్పవాడు లేకపోతే ఆ గురువు గొప్పవాడు ఈ గురువు గొప్పవాడు లేకపోతే ఈ మంత్రం గొప్పది అనుకొంటూ అనవసరమైన గొడవలలోనికి వెళ్ళి మీ కాలాన్ని పాడుచేసుకొనే బదులు మీరు బాగుపడటానికి, హృదయంలో ఉన్న సత్యవస్తువును తెలుసుకోవటానికి మీ తెలివితేటలను ఉపయోగించుకోండి. ఒక మనిషి ఎప్పుడయినా పొరపాటు చెయ్యవచ్చు. పొరపాటు చేసాం కదా అని వెంటనే గ్రహించి ఆ పొరపాటును సవరించుకోవాలి, అది తెలివైనవాడి లక్షణం. చేసిన పొరపాటు మళ్ళీ జరగకుండా చూసుకోవాలి, పశ్చాత్తాపపడాలి, అది మానవధర్మం.

ఒకసారి దేవఋషి నారదుడు విష్ణువుని అడిగాడు. ఈ భూమిమీద ఎవరయినా ఒక భక్తుడి పేరు చెప్పండి, అతనిని దర్శనం చేసుకొని వస్తాను అని అడిగాడట. అప్పుడు విష్ణుమూర్తి చెప్పాడు ఉజ్జయినీ నగరానికి దగ్గరలో ఒక పల్లెటూరులో గోవిందుడు అనే భక్తుడు ఉన్నాడు, అతను నా భక్తుడు, అతనిని దర్శనం చేసుకో అని చెప్పాడు. అతనిని దర్శించటంకోసం నారదుడు బాటసారి వేషంలో గోవిందదాసు ఇంటికి వెళ్ళాడు. ఆయనకు మర్యాద చేసి కూర్చోబెట్టాడు గోవిందదాసు. అక్కడ కొంతసేపు కూర్చొనేసరికి మన ఇళ్ళలో జరిగే గొడవే అక్కడా ఉంది. బియ్యంలేవు, పాలు రావాలి అని ఇలా ఏదో గొడవ ప్రతీ సంసారంలోనూ ఉంటుంది కదా అలాగే అక్కడ గోవిందదాసు భార్య ఆయన మీద చిరాకు పడుతూ ఉంటే ఇతను కూడా చిరాకు పడుతున్నాడు. ఏమిటి ఇలా చిరాకు పడుతున్నాడు, ఇతను ఏదో గొప్ప భక్తుడు అని విష్ణువు చెప్పాడు కదా. మనిషి అయిన తరువాత ఏదో పొరపాటు వస్తుంది, అలాగే దేవుడు కూడా పొరపాటు పడి నాకు రాంగ్ ఎడ్రస్ ఇచ్చాడు అని నారదుడు అనుకొన్నాడు. భార్య భర్త మీద చిరాకు పడుతోంది. భర్తేమో భార్యమీద చిరాకు పడుతున్నాడు. పోనీ మామూలు భర్తకాదుకదా, గోవిందదాసు గొప్ప భక్తుడు అని చెప్పాడు కదా. దేవుడు అబద్ధం చెప్పడే? అయినా చూద్దాం. ఏదో భార్యాభర్తలకు కీచులాటలు వచ్చాయి. ఇతడు భక్తుడు కాదు అని అంత తొందరగా అనుకొని బయటకు పోవటం ఎందుకు అనుకొని ఒకరోజు మీ ఇంట్లో ఉంటానని నారదుడు గోవిందదాసుని అడిగాడు. గోవిందదాసు ఉండమని చెప్పాడు. ఇద్దరూ పొలం వెళ్ళారు. అక్కడా మామూలు గొడవే దూడలకు గడ్డి వేశావని వేయలేదని ఇటువంటి గొడవలే. కానీ 24గంటలలో మూడుసార్లు

నారాయణ నారాయణ నారాయణ అని భగవంతుడిని స్మరించాడు గోవిందదాసు. అప్పుడు నారదుడు భగవంతుడు చెప్పింది అబద్ధం అని ఒక నిర్ణయానికి వచ్చాడు. నాకు ఇతనిలో ఏమీ ప్రత్యేకత కనబడలేదు కష్టజీవే, కాని ఇతడు భక్తుడు అంటాడేమిటి అనుకొన్నాడు నారదుడు. గోవిందదాసు దగ్గర సెలవు పుచ్చుకొని నారదుడు వెళ్ళిపోయాడు. అప్పుడు నారదుడు విష్ణువు దగ్గరకు వచ్చి అతను నాకు భక్తుడిగా కనబడలేదు. అతను శ్రామికుడే, ప్రతీ కుటుంబంలో ఉన్న పేచీలు అక్కడా కనిపించాయి, అతనిలో ఏమీ ప్రత్యేకత నాకు కనబడలేదు అని విష్ణువుతో చెప్పాడు. అప్పుడు విష్ణువు ఒక కప్పునిండా నూనెపోసి నారదుడికి యిచ్చి ఈ కప్పులో నూనె ఒక్క చుక్క కూడా కిందపడకుండా మేరుపర్వతం మీద పెట్టి రమ్మన్నాడు. దేవఋషివి కాబట్టి గాలిలో వెళ్ళిపోవటం కాదు. ఆ గోవిందుడు ఎంత కష్టపడి పని చేసుకొంటున్నాడో అలాగే నువ్వూ మానవుడిలాగ నడిచి వెళ్ళు అని చెప్పాడు. నారదుడు మంచి ఏకాగ్రతతో, మనస్సును అటుఇటు చెదరనివ్వకుండా జాగ్రత్తగా ఒక్క చుక్కకూడా కింద పడకుండా మేరు పర్వతం మీద కప్పును పెట్టాడు. నేను జయించాను అనుకొన్నాడు. విష్ణువు దగ్గరకు వచ్చి మీరు చెప్పిన పని చేసేసాను, ఒక్క చుక్క కూడా కింద పడనివ్వలేదు, నేను సక్సెస్ అయిపోయాను అన్నాడు. రైటే, ఈ ప్రయత్నంలో ఒక్కసారి అయినా నన్ను స్మరించావా అని విష్ణువు అడిగాడు. మిమ్మల్ని స్మరించలేదు, నా మనస్సు అంతా ఆయిలు కింద పడకూడదు అనే దాని మీదే ఉంది అన్నాడు. అప్పుడు విష్ణువు ఏమన్నాడంటే ఈ చిన్న పని మీదే నీ మనస్సు, బుద్ధి అంతా పెట్టేసి నన్ను ఒక్కసారి కూడా స్మరించలేదు. ఇంత సంసార బాధ్యతను మోస్తూకూడా రోజుకి 24గంటలలో గోవిందదాసు నన్ను మూడు సార్లు స్మరించాడు అని నువ్వే చెప్పావుకదా. ఇప్పుడు చెప్పు నువ్వు భక్తుడివా, వాడు భక్తుడా అన్నాడు విష్ణుమూర్తి. ఇంతకీ మీకు ఈ విషయం ఎందుకు చెపుతున్నానంటే మీరు సంసారంలో ఉండికూడా భగవంతుడిని అప్పుడప్పుడూ స్మరించుకొన్నప్పటికీ మీకు ఆధ్యాత్మిక పురోగతి వస్తుంది. మెకానికల్‌గా కాకుండా, ప్రేమతో భక్తితో ఆప్యాయతతో నిండుమనస్సుతో భగవంతుడి నామాన్ని కనీసం నాలుగుసార్లు స్మరించుకొన్నప్పటికీ మీకు ఆధ్యాత్మికంగా మంచి మార్పులు పడతాయి. మీకు ఏ కోరికలు కావాలన్నా నెరవేరతాయి. మీరు తొందరపడకండి. మీరు చేసుకొనే జపాలవల్ల, ధ్యానాలవల్ల మీ కోరికలు నెరవేరతాయి కాని మీ గమ్యం అది కాదు సత్యాన్ని తెలుసుకోవటమే, భగవంతుడిని తెలుసుకోవటమే మీ గమ్యం. ఇది గుర్తుపెట్టుకోండి.

మన శరీరం, ఈ వ్యవహార జగత్తు అంతా కూడా స్వప్నంతో సమానము. కాని

అది మనకు నిజంగా కనిపిస్తోందా, అబద్ధంగా కనిపిస్తోందా? ఇది అంతా అబద్ధం అని శాస్త్రం చెపుతోంది, కాని ఇది మనకు నిజంగా కనిపిస్తోంది. మీరు నాకు నిజంగా కనిపిస్తున్నారు, నేను మీకు నిజంగా కనిపిస్తున్నాను. ఈలోకం, మనుషులు అంతా నిజంగా కనిపిస్తున్నారు. చనిపోవటాలు, పుట్టటాలు, లోకంలో జరిగే గొడవలు అన్నీ కూడా నిజంగానే కనిపిస్తున్నాయి. కాని శాస్త్రం మాత్రం ఇది అంతా నిజంకాదు, ఇది అబద్ధం అని చెప్తోంది. కాని ఒక్క విషయం మీరు మనస్సులో పెట్టుకోండి. ఏదో ఒక నిజం ఉంది, అది మన హృదయంలోనే ఉంది. అసలు ఏదో ఒక నిజం ఉంది కాబట్టి నిజం కానిది కూడా మనకు నిజంగా కనిపిస్తోంది. ఇక్కడ మైకు ఉంది. చీకటిలో ఇది మీకు దుంగలాగ కనిపించవచ్చు. ఇది దుంగ కాదు మైకే. అసలు మైకుఅనేది ఒకటి ఉంది కాబట్టి అది మీకు దుంగలాగ కనిపించింది. అక్కడ ఏదీ లేదు అనుకోండి, ఇంక మీకు దుంగ కనబడదు. అదే విధంగా సత్యం ఒకటి ఉంది. మీరు పరమాత్మ అనండి, స్వర్గరాజ్యం అనండి, మోక్షం అనండి, ఆత్మ అనండి ఏదో ఒక నిజం ఇక్కడ ఉంది. మన కంటికి కనిపించేదంతా నిజంకాదు. ఏదో ఒక నిజం ఉంది కాబట్టి ఇదంతా నిజంలా మనకు కనిపిస్తోంది. ఏదైతే నిజమో, ఏదైతే సత్యమో అది మీహృదయంలోనే ఉంది. అది మీకు అనుభవంలోనికి వచ్చినప్పుడు అందులో ఉన్న సుఖం ఏమిటో మీకు తెలుస్తుంది. అయితే దానిని తెలుసుకోవటానికి మనకు శక్తి చాలటంలేదు. మనం నామం చేస్తున్నాము కాని ఆనామం మీద మనకు విశ్వాసం లేదు. గాలివాన వచ్చినప్పుడు మనం తాటాకు ఇంటిలో ఉంటే అది కూలిపోతుందేమోనని మనకు భయం వేస్తుంది. అదే మీరు డాబాలో ఉన్నారనుకోండి, మీకు భయం వేయదు. మీరు చేసే నామం మీద కనుక మీకు విశ్వాసం ఉంటే మీరు డాబాలో ఉన్నట్లే. మీకు ఎన్ని బాధలు, కష్టాలు ఉన్నప్పటికీ, సంసారంలో ఎన్ని హెచ్చుతగ్గులు ఉన్నప్పటికీ మీరు చేసే నామం మీద కనుక మీకు విశ్వాసం ఉంటే మీకు భయం అనేది పుట్టదు.

మీరు జ్ఞానాన్ని సంపాదించండి. ఎవడైతే జ్ఞానాన్ని సంపాదించాడో వాడు నా స్వరూపాన్ని పొందుతాడు, వాడితో సమానమైనవాడుకాని, వాడిని మించిన వాడుకాని ఈ లోకంలో కాని పరలోకంలోకాని లేడు అని పరమాత్మ గీతలో చెప్పాడు. అయితే మనకు ఉదయం లేచినది మొదలు రాత్రి పడుకొనేవరకు అజ్ఞానం దర్శనం యిస్తోంది, కాని జ్ఞానం దర్శనం ఇవ్వటం లేదు. ఉదయం లేవగానే మనకు ఆత్మ దర్శనం కాదు. అహంకారం దర్శనం ఇస్తోంది. మనం ఆత్మను పూజించటంలేదు, అహంకారాన్ని పూజిస్తున్నాము. అహంకారాన్ని సంతృప్తి పరచటం కోసం నేను పూజలు చేస్తూఉంటే, యజ్ఞాలు యాగాలు

చేస్తూ ఉంటే నాకు సైతాను దర్శనం ఇవ్వకపోతే దేవుడు ఎలా దర్శనం ఇస్తాడు. మీరు చేసే దానాలు, ధర్మాలు, యజ్ఞాలు యాగాలు ఇవన్నీ నిజమయితే మీకు దేవుడు ఎందుకు దర్శనం ఇవ్వటంలేదు. ఒక మనిషి ఇంకో మనిషిని మోసం చేయగలడు, కాని మానవుడు దేవుడిని మోసం చేయలేడు. నువ్వు పెట్టే నమస్కారాల వల్ల, నువ్వు పాడే కీర్తనలవల్ల దేవుడు మోసపోడు. ఆయన అంత అమాయకుడు కాదు. మేము భగవద్గీత పారాయణం చేస్తాము, రామాయణ పారాయణం చేస్తాము అంటారు. చేయండి నేను కాదనటంలేదు. కనీసం ఆ భగవద్గీతలో ఒక్కో శ్లోకం తీసుకొని, దానిని అర్థం చేసుకొని ఆచరించటానికి మీరు ఎందుకు ప్రయత్నం చేయరు. అలా ప్రయత్నం చేస్తే అప్పుడు మీ అజ్ఞానంతో మీకు సంఘర్షణ ప్రారంభం అవుతుంది. ఏదయినా ఒక శ్లోకం తీసుకొని దానిని ఆచరించటానికి ప్రయత్నం చేస్తే అప్పుడు మీలో ఉన్న అజ్ఞానం అంటుకొంటుంది. అది పూర్తిగా తగలబడటానికి కొంచెం టైము పట్టవచ్చు. మేము ఆచరించము, పారాయణలే చేస్తాము అంటే దానివలన మీకు పుణ్యం రావచ్చు, మంచి జన్మలు రావచ్చు కాని ఇదంతా మాయలో ఒక భాగమే.

ప్రతీ మనిషికి స్వార్థం ఉంది. వాడు భక్తుడు అయినా, భక్తుడు కాకపోయినా వాడికి స్వార్థం ఉంది. స్వార్థంలోనుండి బయటపడటానికి ఎవడయినా ప్రయత్నం చేస్తున్నాడా? నేను కర్తను అని పనిచేస్తే, అహంబుద్ధితో పనిచేస్తే మీరు మంచి చేస్తే మంచి వస్తుంది, చెడు చేస్తే చెడు వస్తుంది. రమణమహర్షిగారి సందేశం అది కాదు. అదీ ఇదీ రెండూకూడా స్వప్నంతో సమానం అన్నారు. నువ్వు మంచిచేస్తే మంచి లోకాలు రావచ్చు, చెడుచేస్తే చెడ్డలోకాలు రావచ్చు, ఇవన్నీ కూడా ఆత్మలో కల్పితమే. ఇవన్నీ ఏ ఆత్మలో అయితే కల్పించబడ్డాయో దానిని గ్రహించు. అప్పుడు కాని నువ్వు మాయలోనుండి బయటకు రాలేవు. మీరు మంచి చేస్తే మంచి లోకాలకు వెడతారు. అక్కడ ఎంతకాలం ఉంటారు. మీరు స్వార్థంలోనుండి వేరు పడకపోతే, స్వార్థంలోనుండి బయటకు రాలేకపోతే భగవంతుడి దర్శనం కాదు. మీ శరీరాన్ని, మీ యింటిని, మీ సంస్కృతిని, సమాజాన్ని మరిచిపోయి మీరు ఎప్పుడయినా దేవుడిని ప్రేమించారా? తోటి మానవుడికి ఎప్పుడయినా సహాయం చేసారా? ప్రతీవాడూ డబ్బు డబ్బు అంటారు. ఎదుటి మనిషిని సుఖపెట్టటం కోసం డబ్బు ఉండనక్కరలేదు. అహంకారం నశించటం కోసం, స్వార్థం నశించటం కోసం మీ ఇంటి దగ్గర ముసలి వారు ఉంటే, ఎలా ఉన్నారండీ మామ్మగారు, కులాసాగా ఉన్నారా అని ఒక కరుణాపూరితమైన మాట, కరుణాపూరితమైన చేత మీరు ఎప్పుడయినా జీవితంలో చేసారా?

రామానుజుడి పేరు మీరు వినే ఉంటారు. రమణమహర్షిని సుబ్రహ్మణ్యస్వామి అవతారమని పెద్దలు ఎలాగయితే చెపుతున్నారో, రాముడి తమ్ముడు లక్షణుడే రామానుజుడిగా జన్మించాడని వైష్ణవుల నమ్మిక. ఆయన వాల్మీకి రామాయణం గురువు గారిచేత 14సార్లు చెప్పించుకొన్నాడు. ఆయనకు తిరుమల కొండ అంటే ఎంత ఇష్టం అంటే పాదాలతో ఆ కొండను తొక్కలేక గురువు గారిని కొండపై నుంచి దారిలోకి రమ్మని, ఈయన ఆ దారి దాకా నడిచి వెళ్ళేవాడు. రామానుజుడు తిరుమలనంది అనే ఆయనకు కొంతకాలం అతిథిగా ఉన్నాడు. తిరుమలనందికి గోవిందుడు అనే శిష్యుడు ఉన్నాడు. అతను రోజూ సాయంత్రం గురువుగారికి పడుకోవటానికి పక్క వేసేవాడు. ఒక రోజు తిరమలనంది పనిమీద ఊరికి వెళ్ళాడు. శిష్యుడు పక్కవేసి దాని మీద దొర్లుతున్నాడు. అది రామానుజుడు చూసాడు. రామానుజుడు కూడా మహాత్ముడే, అటువంటివారిని కూడా మాయ ఎలా కమ్మేస్తుందో చూడండి. ఇదేమి శిష్యుడు అనుకొన్నాడు రామానుజుడు. తిరుమలనంది వచ్చాక ఇది మంచి పద్ధతికాదు అని ఆయనతో చెప్పాడు. ఆయన గోవిందుడిని పిలిచి అడిగాడు. గురువు గారికి పక్కవేసి దానిమీద పడుకొంటే దోషం వస్తుందని నీకు తెలియదా? ఆ దోషానికి శిక్ష ఉంటుందని, మరణించిన తరువాత చెడ్డలోకాలు వస్తాయని నీకు తెలుసా? అంటే తెలుసు అన్నాడు శిష్యుడు. అన్నీ తెలిసి ఇటువంటి చెడ్డపని ఎందుకు చేసావు అన్నాడు తిరుమలనంది. అప్పుడు గోవిందుడు అన్నాడు అన్ని చెడ్డలోకాలు వచ్చినా నాకు ఇష్టమే కాని మీ దగ్గర నేర్చుకొన్న విద్య నాకు ముఖ్యం. మిమ్మల్ని సుఖపెట్టటం కోసం, అది హాయిగా ఉందో లేదో, మధ్యలో ఏమైనా ముడుతలు ఉన్నాయేమో అని చూడటం కోసం, ఒకవేళ పక్కమీద ఏమయినా చీమలు ఉన్నాయేమో చూడటం కోసం, నేను దొర్లినప్పుడు ఒకవేళ చీమలు ఉంటే నన్నే కుడతాయి కదా, మరల దులపటం కోసం అలా చేసాను. ఈ పొరపాటుకు నాకు నరకం వచ్చినా, చెడ్డలోకాలు వచ్చినా అనుభవించటానికి సిద్ధంగా ఉన్నాను, మీ పట్ల ఉన్న ప్రేమకొలది, మిమ్మల్ని సుఖపెట్టాలనే ఈ ప్రయత్నంలో చెడ్డ వచ్చినా భరించటానికి సిద్ధంగా ఉన్నాను అని చెప్పాడు. ఆ ప్రేమచూడండి. గురుశిష్యుల ప్రేమ అలా ఉండాలి. మనది వ్యాపార సరళి. భక్తి అయినా, మాటలు అయినా అన్నీ వ్యాపారమే. జీవితమే వ్యాపారం. అప్పుడు రామానుజుడు అన్నాడు నన్ను వివేకవంతుడిని చేసావయ్యా గోవిందా అన్నాడు. నిజమైన గురువు తన శిష్యుడు తనకంటే అభివృద్ధిలోకి వస్తే సంతోషిస్తాడు. నిజమైన తండ్రి తన బిడ్డ తనకంటే అభివృద్ధిలోనికి వస్తే సంతోషిస్తాడు. ఓర్వలేని వాడు గురువు కాడు, వాడు బరువు.

మనందరికీ స్వార్థం ఉంది. స్వార్థాన్ని విడిచిపెట్టకపోతే నిస్వార్థస్థితి రాదు. కామాన్ని

విడిచిపెట్టకపోతే నిష్కామస్థితి రాదు. నిస్వార్థస్థితి రాకుండా, నిష్కామస్థితి రాకుండా మనకు నిజం అందదు. అసలు స్వార్థం అనేది ఒకటి ఉందని గుర్తించి దానిలోనుండి బయటపడటం కోసం మానవుడు ప్రయత్నం చేయాలి. టెక్నాలజీ అభివృద్ధి పొందింది, సైన్స్ అభివృద్ధి పొందింది. పూర్వం ఇక్కడ నుండి పాలకొల్లు వెళ్ళాలి అంటే నడిచి వెళ్ళేవాళ్ళము. ఇప్పుడు కార్లు వచ్చేసాయి. పూర్వం కొన్నిరోగాలు వస్తే మనుషులు చనిపోయేవారు, ఇప్పుడు ఆ రోగాలకు మందులు కనిపెట్టారు. ఒకటి గుర్తు పెట్టుకోండి. ఇదంతా దేహరక్షణకు, దేహం సుఖపడటానికి ఉపయోగపడుతుంది. కాని మీ మనస్సును పవిత్రం చేసుకోవటానికి మీరెవరో మీరు తెలసుకోవటానికి ఈ సైన్స్ కాని, టెక్నాలజీకాని మీకు సహకరించదు. కార్లు, విమానాలు, పెద్దపెద్ద వెపన్లు ఎన్నో వచ్చాయి. అంతమాత్రం చేత మన మనస్సు, ఇంద్రియాలు మన స్వాధీనం లోనికి వచ్చాయా? నా స్వార్థంలోనుండి, నా దుఃఖంలోనుండి నేను బయట పడటం కోసం ఈ సైన్స్ కానీ, టెక్నాలజీకాని ఏమయినా సహకారం చేసిందా? అయితే మీరు మంచి చేయండి, మంచికోసం జీవించండి, మంచికోసం మరణించండి. మీరు చేసే ప్రతీ మంచిపనీ మీకు తిరిగి వచ్చేస్తుంది. అలాగే మీరు చేసే చెడ్డకూడా మీకు తిరిగి వస్తుంది. మీరు ధర్మంగా ఉంటే, మీరు సహృదయం కలిగి ఉంటే, మీరు సద్బుద్ధి కలిగి ఉంటే, మీరు తోటిమానవుల పట్ల ఎంతో కొంత కరుణ, దయ, ప్రేమ చూపిస్తూఉంటే మీ మనస్సు సంస్కరింపబడుతుంది, మీ మనస్సు సూక్ష్మం అవుతుంది, మీ మనస్సు శుద్ధి అవుతుంది. ఆ సూక్ష్మమైన మనస్సు, పవిత్రమైన మనస్సు మీకు ఆత్మకు దారి చూపిస్తుంది.

నువ్వు మంచి లోకాలకు వెళ్ళినా నీ మనస్సే కారణం, నువ్వు చెడ్డ లోకాలకు వెళ్ళినా నీ మనస్సే కారణం. అందుచేత నీ మనస్సును బాగుచేసుకో. నీ మనస్సుతో విరోధం పెట్టుకోవద్దు, నీ మనస్సుతో స్నేహంగా ఉండు అని పరమాత్మ చెప్పాడు. నువ్వు బాగుపడాలంటే నీ మనస్సును అదుపులో పెట్టుకో. నీ మనస్సు నీకు విరోధిగా పనిచేస్తూ ఉంటే నువ్వు అభివృద్ధిలోనికి రాలేవు. అందుచేత నీ మనస్సుతో స్నేహంగా ఉండు. మీరు ఇంటిలో పేచీలు వస్తే, సమాజంలో పేచీలు వస్తే అనేక సమస్యలను పరిష్కారం చేసుకొంటున్నారు. ఇదంతా మంచిదే. కాని మీ మనస్సు అనే సమస్యను పరిష్కారం చేసుకోండి. అది కూడా ఒక సమస్యే. దానిని పరిష్కారం చేసుకోండి. మీకు ఏ దేవత అయితే ఇష్టమో ఆ దేవతను ప్రీతిగా, ఇష్టంగా ఆరాధించండి. మీరు ఏ దేవతనైతే ఆరాధిస్తున్నారో ఏది నిజమో మీకు తెలియకపోయినా, ఆ దేవతకు తెలుసు. నిజం దగ్గరకు మిమ్మల్ని తీసుకొనిపోయేవరకు ఆ దేవత మిమ్మల్ని విడిచిపెట్టదు. అందరికీ అన్నం గొడవే గాని ఆత్మ గొడవ ఎవరికీ లేదు అని

ఈమధ్య సత్యసాయిబాబాగారు అన్నారు. అంటే అన్నం గొడవ వద్దని కాదు. దేహం నిలబడటానికి అన్నం అవసరమే, అన్నం తినొద్దని కాదు ఆయన చెప్పేది. మీ లక్ష్యం అన్నంకాదు, మీ లక్ష్యం ఆత్మను తెలుసుకోవటం. ఆత్మదర్శనం అయితేనేగాని మీకు జ్ఞానం కలుగదు. జ్ఞానం కలిగితేనే కాని మాయలో నుండి, దుఃఖంలోనుండి మీరు బయటపడలేరు. ఈవేళ మీకు తాత్కాలికంగా ఏమైనా సుఖం ఉంటే, సంతోషం ఉంటే అది నిజమని మీరు నమ్మకండి. ఇది ఊడిపోవడానికి ఎంతోకాలం పట్టదు. రేపు తెలుసుకుందాం, మళ్ళీ జన్మలో తెలుసుకుందాం అనుకొంటే దానికి అంతే ఉండదు. మళ్ళీ జన్మలో మనకు పరిస్థితులు అనుకూలంగా ఉంటాయని ఏం చెప్పగలము? వారు తిట్టారండీ, వీరు కొట్టారండీ అని ఇటువంటి మాటలు ఏవో చెపుతూ ఉంటారు. వీటినే భరించలేకపోతే ఇంక మీరు ఆత్మను ఏమి తెలుసుకొంటారు. నీ మనస్సుకు బలం చేకూర్చటంకోసం, నీ మనస్సును ఆత్మవైపుకు నడిపించటంకోసం ఒకోసారి భగవంతుడు తలుపు సందున పెట్టి నలిపినట్లు మిమ్మల్ని కష్టాల్లో పెడతాడు. మీరు కంగారుపడవద్దు. భగవంతుడికి మీయందు ప్రేమ ఉంది కాబట్టే మీ మనస్సును బాగుచేయటంకోసం, మీ మనస్సుకు లోచూపు కలగజేయటంకోసం, ఆత్మవైపు గురిపెట్టటం కోసం మీకు కొన్ని క్లిష్ట పరిస్థితులు పెడతాడు. వాటిని చూసి మీరు పారిపోవద్దు. మనం చిన్న చిన్న కష్టాలే భరించలేకపోతే ఆత్మవస్తువు ఎలా దొరుకుతుంది. మన అహంకారానికి అవమానాలు అంటే ఇష్టం ఉండదు, బహుమానాలు అంటే ఇష్టం. మనం బహుమానాలకు అలవాటుపడితే, పొగడ్తలకు అలవాటుపడితే అహంకారం పెరుగుతుంది. అవమానాలకు అలవాటుపడితే అహంకారం తగ్గుతుంది.

నీకు నువ్వే శత్రువు, నీ అహంకారమే నీ శత్రువు. అహంకారాన్ని జయిస్తే నీకు నువ్వే మిత్రుడవు అవుతావు. అహంకారాన్ని జయించలేకపోతే నీకు నువ్వే శత్రువు అవుతావు. నీ అహంకారమే నీ శత్రువు, నీ మలిన మనస్సే నీకు శత్రువు అని భగవంతుడు చెపుతున్నాడు. నీ మిత్రులు నీ అహంకారాన్ని పొగుడుతున్నారు, నీ విరోధులు నీ అహంకారాన్ని విమర్శిస్తున్నారు. నిజంగా నీకు నీ మిత్రులు సహాయం చేస్తున్నారా? నీ శత్రువులు సహాయం చేస్తున్నారా? ఈ చిన్న రహస్యం మీరు అర్థం చేసుకోండి. మీరు ఎవరికీ రివీల్ చెయ్యకండి. ఈ విషయం మీకు అర్థమైతే మీ శత్రువులను మీరు ద్వేషిస్తారా? మీకు ఎన్నో కుయుక్తులు, కుతంత్రాలు తెలిసి ఉండవచ్చు. మీ కుయుక్తులకు, కుతంత్రాలకు ఆత్మ అందదు. మీరు పెద్ద పెద్ద పనులు చెయ్యవద్దు. చిన్న చిన్న పనులే చెయ్యండి. అయితే ఆ పనులు దయపూరితంగా, ప్రేమపూరితంగా ఉండాలి. అప్పుడు భగవంతుడు సంతోషించి మిమ్మల్ని సింహాసనం మీద కూర్చోబెడతాడు. మీరు అడగకుండానే మీకు ఏది మంచిదో అది మీకు

ఇస్తాడు. కోరికకు శక్తిలేదు, పరమాత్మకు శక్తి ఉంది. మీరు మంచి ఉద్దేశంతో చేస్తే మీరు చేసే చిన్నపనికి కూడా పెద్ద ఫలితం ఇస్తాడు. మీ ఉద్దేశం మంచిది కాకపోతే మీరు చేసింది పెద్దపని అయినప్పటికీ చిన్న ఫలితాన్ని ఇస్తాడు.

**కర్తురాజ్ఞయాప్రాప్యతే ఫలమ్ కర్మకింపరం కర్మ తజ్జడమ్**

కర్మ జడవస్తువు. కర్మకి ఫలితాన్ని యిచ్చే శక్తి లేదు. ఫలితాన్ని యిచ్చేవాడు పరమేశ్వరుడు. వాడు సర్వసాక్షి. అన్నీ చూస్తున్నాడు. వాడు ఎక్కడో నీకు దూరాన లేడు, నీ హృదయంలోనే ఉన్నాడు. నువ్వు నిద్రపోతున్నావు కాని వాడికి నిద్రలేదు. నువ్వు చేసే చిన్నపని అయినా కరుణాహృదయంతో చేస్తున్నావో లేదో చూస్తూ ఉంటాడు. నువ్వు చేసేది బహుచిన్నపని అయినా అది మంచి హృదయంతోటి, మంచి సంకల్పంతోటి చేసివదిలెయ్యి. నిన్ను ప్రేమశిఖరాలకు తీసుకొని వెళ్ళి మోక్షసామ్రాజ్యానికి అధిపతిని చేస్తాడు. నువ్వు ఫలితం కోసం ఎదురుచూడకు. ఫలితం ఈశ్వరుడిచేతిలో ఉంది. నువ్వు బలవంతం చేస్తే ఇవ్వడు, ఆయన హృదయం పొంగితే ఇస్తాడు. నువ్వు చేసే కర్మనిబట్టి ఫలితం రాదు. నువ్వు చిన్న పని చేస్తే పెద్ద ఫలితం రావచ్చు. పెద్దపని చేసినా చిన్న ఫలితం రావచ్చు. పని చేయటమే నీవంతు, ఫలితం ఇచ్చేది పరమేశ్వరుడు. మీరు చేసేది చిన్నపని అయినా దయతో చెయ్యండి. మీ ఇంటిలో ముసలమ్మలు ఉంటే, ఇంటి పక్కన ఎవరైనా దిక్కులేని వారు ఉంటే ఒక చిన్నమాట, కరుణాపూరితమైన మాట అనలేరా? పోనీ డబ్బుకు కరువు వాసి ఉండవచ్చు, మాటలకు కూడా కరువు వాసి ఉన్నారా? ఒక వంద సత్తరవులు, వంద హాస్పటల్స్ కట్టినవాడు జ్ఞానికాడు, వాడి దేహప్రారబ్ధాన్నిబట్టి కడితే కట్టవచ్చు. జ్ఞాని ఎవడు అంటే ఎవడు రాగద్వేషములనుండి విడుదల పొందాడో, ఎవడి హృదయంలో నుండి అయితే రాగద్వేషములు రాలిపోయాయో వాడిలో ఉంది వైభవం అంతా, అక్కడ ఉంది జ్ఞానం.

ప్రతీ చిన్నవిషయానికి భయపడకండి, ఇలా భయపడితే మీరు భగవంతుడికి దూరమైపోతారు. మీకు భగవంతుడిమీద భక్తి ఉన్నమాట నిజం అయితే మీకు భయం ఉండదు. మీకు భయం వేస్తూ ఉంటే భగవంతుడి మీద భక్తి తక్కువగా ఉన్నట్లు గుర్తు. సమర్థరామదాసు శివాజీకి గురువు. ఆయన అద్వైతమే కాకుండా రామనామం చేసుకోండి, నామాన్ని విడిచిపెట్టవద్దు, నామమే మీ సొమ్ము, నామం కూడా ఐశ్వర్యమే అని చెప్పేవాడు. శివాజీ ఆస్థానంలో ఒక పండితుడు ఉండేవాడు. ఆయన ఇదంతా మాయ, నామంలో ఏముంది అనేవాడు. సమర్థరామదాసుతో మీకు పాండిత్యం సరిపడలేదు అందుకే నామం గురించి చెపుతున్నారు అనేవాడు. రామదాసు ఓర్పుగా ఉన్నాడు. శివాజీ రాజ్యంలోకి ఒక

మాంత్రికుడు వచ్చాడు. వాడు ఒక తాడును ఇలా తిప్పి పాముగా మార్చేసాడు, అది బుసలు కొడుతోంది, దగ్గరగా ఉన్నవారు లేచిపోయారు, అప్పుడు రామదాసు ఆ పండితుడిని పిలిచి "ఇదంతా మాయ అంటున్నావు కదా, అది తాడే పాముగా మార్చాడు, మీరు వెళ్ళి ఆ తాడును పట్టుకొని రండి" అని చెప్పాడు. "అయ్యబాబోయ్ దగ్గరకు వెళితే కరిచేలా ఉంది" అన్నాడు పండితుడు. "మరి అంత భయస్తుడవు ఇదంతా మాయ అని చెప్పటానికి పనికి వస్తావా? ఎందుకయ్యా నీ మెట్టవేదాంతం" అన్నారు. అప్పుడు రామదాసు వెళ్ళి ఆ పామును తీసుకొని వచ్చి దగ్గర కూర్చున్నాడు. అప్పుడు రామదాసు ఏమన్నాడు అంటే "నీకు అనుభవంలో లేనప్పుడు నోటితో చెప్పి లాభం లేదు. ఈ ప్రపంచం నీకు నిజంగా కనిపిస్తోంది. నోటితో మాయ, మాయ అంటే సరిపోతుందా? అది తాడు అయినప్పటికీ నీకు పాముగా కనిపిస్తోంది, నీకు భయం వేస్తోంది, దగ్గరకు వెళ్ళను అంటున్నావు. అదేవిధంగా ఈ ప్రపంచం కూడా అబద్ధం అయినప్పటికీ నీకు నిజంగా కనిపిస్తోంది. నీ హృదయానికి అది అబద్ధం అని తోచినప్పుడు అది అబద్ధం అని చెప్ప. అంతేగాని మెట్టవేదాంతం చెప్పకు. మనకు ఎంతసేపు నిజం కంటే కనిపించటం ముఖ్యం. మీకు తాత్కాలికంగా కొన్ని బాధలు ఉండవచ్చు. వాటిని పరిష్కరించుకొంటారు అనుకోండి, కొత్తబాధలు వచ్చేస్తాయి. ఈ లోపల శరీరం పడిపోతుంది, కొత్తశరీరం వస్తుంది, మరల కొత్తబాధలు వచ్చేస్తాయి. దేహాత్మబుద్ధి, దేహమే నేను అనుకొనే బుద్ధి ఉన్నంతకాలం ప్రతీవాడికి ఏదో బాధ, ఏదో కష్టం వస్తూనే ఉంటుంది. వాడికి జననం, మరణం వస్తూనే ఉంటాయి. తాత్కాలికంగా ఏదైనా సుఖం ఉన్నట్లు మీకు అనిపించినప్పటికీ అది సుఖంకాదు, అది దుఃఖమే.

పుస్తకాలు అవసరమైతే మీరు చదువుకోండి. ఈ నేను తెలుసుకోవటానికి మీకు పుస్తకాలతో పనేముంది? మంత్రం సహాయం, గుడుల సహాయం, దేవతల సహాయం అవసరమైతే తీసుకోండి. నేను వద్దనటం లేదు. వీటితో ఏమీ పనిలేకుండానే నేనును మీరు తెలుసుకోవచ్చు. మీకు రాగద్వేషాలు లేనప్పుడు, కోపతాపాలు లేనప్పుడు కూడా నేను అనే బుద్ధి ఉంది. మీరు ప్రశాంతంగా కూర్చొన్నప్పుడు కూడా నేను అనే బుద్ధి ఉంది. ఈ నేను అనే బుద్ధి మీకు ఎప్పుడూ కామన్‌గా ఉంటుంది. అది పరిష్కారం అయ్యేవరకు జన్మ రహస్యం నీకు తెలియదు, సృష్టి రహస్యం నీకు తెలియదు. దీనికి ఎవరో ఇతరులు మీకు సహకరించటం కాదు, మీ మనస్సు యింద్రియాలు మీకు సహకరించాలి, మీరు చేసే పని మీకు సహకరించాలి. ఇన్ని రకాలుగా సహకారం మీకు అందితే మీరెవరో మీకు తెలుస్తుంది. భగవాన్‌తో ఒక భక్తుడు ఆశ్రమంలో ఉన్న ఒకరి గురించి ఇలా చెప్పాడు. వాడు చాలా

పండితుడే కాని మాట్లాడితే చిరాకు పడుతున్నాడు అని చెప్పాడు. అప్పడు భగవాన్ ఏమన్నారు అంటే అతనిలోపల ఉన్న వాసన బయటకు రావాలి. అలా మాట్లాడటం ద్వారా కాని ఆ వాసన బయటకు పోదేమో? దానికి నువ్వు కంగారుపడవలసిన పనిలేదు అని చెప్పారు. నాలో ఉన్న వాసనలు నాశనం అయ్యేవరకు నాకు జ్ఞానం కలుగదు. ఇప్పడు నేను మాట్లాడుతూ ఉంటే డాక్టరుగారు టేప్ చేస్తున్నారు. నేను ఏ మాట చెపుతానో ఆ మాటే టేప్ అవుతుంది. మరల రేపు ఆ మాటే పలకుతుంది కాని కొత్త మాట పలకదు. అదేవిధంగా మనం ఈ జన్మలో అహంకారం పెట్టుకొని ఏ పనులు అయితే చేస్తున్నామో, ఆ పనుల వలన వచ్చే సంస్కారాలు నా హృదయంలో టేప్ అవుతాయి. మరల రాబోయే జన్మలో ఆ టేపు విప్పతారు. నేను చెప్పిన మాటే ఆ టేపు నుండి ఎలా వినబడుతుందో అలాగే మన హృదయంలో ఉన్న వాసనే కోరికగా ఏర్పడుతుంది. ఆ కోరికను బట్టి పని చేస్తాము. మనం చేసిన కర్మనుబట్టి మరల శరీరం వస్తుంది. ఈ చక్రంలో నుండి బయటకు రాలేము.

కామం, క్రోధం, లోభిత్వం ఉండకూడదు అని భగవంతుడు చెప్పాడు. కాని భగవంతుడంత లోభి మరొకడు లేడు. భగవంతుడు మన హృదయంలో ఉండి మనం చేసే ప్రతిచిన్న మంచిపనిని, చెడ్డపనిని కూడా రికార్డు చేసేస్తాడు. పోనీ ఏదో తెలియక చేసాడు అని విడిచిపెట్టడు. భగవంతుడు మీ దేహంకంటే, యింద్రియాలకంటే, మనస్సు కంటే అత్యంత సమీపంలో మీ హృదయంలో ఉండి మీకు వచ్చే ప్రతి చిన్నతలంపుకు సాక్షిగా ఉండి రికార్డు చేస్తున్నాడు. ఎవరినీ చూడనివ్వము అని మీరు తలుపులు మూసేసుకొన్నా ఆయన నుండి తప్పకోలేరు. ఎందుచేతనంటే ఆయన మీ హృదయంలో ఉన్నాడు. మీ హృదయంలో ఉన్న దేవుడు అన్నీ రికార్డు చేస్తున్నాడు, వాటి అన్నింటికి మీరు సమాధానం చెప్పాలి. అప్పటివరకు మిమ్మల్ని విడిచిపెట్టడు. ఈ కర్మచక్రంలో నుండి మీరు బయటకు రాలేరు. మీరు కాశీ చూసారా, రామేశ్వరం వెళ్లారా అని ఎవరైనా భగవాన్‌తో అంటే చూడటానికి ఏముంది అక్కడ, ఆ చూసేవాడు అబద్ధం. చూసేవాడే అబద్ధం అయినప్పడు ఇంక చూడబడేది ఎంతవరకు నిజం అన్నారు. నువ్వు కాశీ వెళ్లావు, అమెరికా వెళ్లావు అన్నీ మనస్సుతో చూసావు. నీ మనస్సే అబద్ధం అయినప్పడు ఆ చూడబడేది ఎంతవరకు నిజం. ఈమధ్య ఒక కోటీశ్వరుడు నాతో ఒకమాట చెప్పాడు. నేను చాలా తెలివితేటలతో, ఎంతో జాగ్రత్తగా, అనేక రకాలుగా డబ్బును సంపాదించాను. ఇంత సంపాదించినా ఈ డబ్బు నాకూడా రాదని ఇప్పడునాకు తెలుస్తోంది. ఈ డబ్బును నేను విడిచిపెట్టలేకపోతున్నాను. ఇప్పడు నాకు దుఃఖం వస్తోంది. నేను ఏమీ నష్టపోలేదు, కష్టపడి సంపాదించిన ఈ

డబ్బును విడిచిపెట్టవలసి వస్తోంది, అందుకే నాకు దుఃఖం వస్తోంది. ఆయన హృదయంలో ఉన్నదే చెప్పాడు. ఆయనకు ముసలితనం వచ్చింది ఇప్పుడు, ఏదోరోజు చనిపోవటం ఖాయం కదా. చనిపోయేటప్పుడు కష్టపడి సంపాదించిన ఈ డబ్బును విడిచిపెట్టవలసి వస్తోంది, నాకు దుఃఖం వస్తోంది అన్నాడు. ఆయన ఏమీ నష్టపోలేదు. ఆయన డబ్బు అంతా బ్యాంకులోను, ఇంటిలోను ఉంది కాని ఆయనకు దుఃఖం వస్తోందట. ఈ డబ్బే నా దుఃఖానికి కారణం అవుతోంది అన్నాడు. అతను ఎంత బాగా చెప్పాడో చూడండి.

రమణస్వామి ఇల్లు విడిచి వెళ్ళేటప్పుడు నేను మోక్షం సంపాదించటానికి వెళుతున్నాను, లోకాన్ని ఉద్ధరించటానికి వెళుతున్నాను అనలేదు. నా తండ్రి ఆజ్ఞననుసరించి వెళుతున్నాను, దీనికోసం వెతకకండి, డబ్బులు ఖర్చుపెట్టకండి, దీనికోసం బెంగ పెట్టుకోవద్దు, మూడు రూపాయలే తీసుకొంటున్నాను, మిగతా రెండు రూపాయలు ఇక్కడే విడిచిపెట్టేస్తున్నాను అని వ్రాసాడు. డివైన్ లీల చూడండి ఆయన దిండివనానికి తప్పు టికెట్టు కొన్నాడు కాని ఆయన తిరువణ్ణామలైకి టికెట్ కొని ఉంటే సరిగ్గా ఆరోజున మధురై నుండి తిరువణ్ణామలైకి టికెట్ మూడు రూపాయలే. తప్పు టికెట్ కొన్నాడు, రైలులో కూర్చున్నాడు. పరమేశ్వరుడికి బిడ్డమీద ఉన్న ప్రేమ, ప్రీతి చూడండి. కళ్ళు మూసుకొని కూర్చున్నాడు. ఆయనకు లోకంతో పనేముంది? అహంకారికి లోకంగాని, అహంకారం లేనివాడికి లోకంతో పని ఏముంది? రైలులో ఒక మౌల్వి ఎక్కడికి వెళుతున్నావు అని ఆయనను అడిగాడు. తిరువణ్ణామలై వెళ్ళాలి, దిండివనానికి టికెట్ కొన్నాను అన్నారు భగవాన్. తిరువణ్ణామలైకి విల్లుపురం నుండి కొత్తగా ఒక లింక్ లైను ఉందే, నువ్వు విల్లుపురంలో మారిపో అని చెప్పాడు. మరుసటి స్టేషన్‌లో మాయమయిపోయాడు. వాడు పరమేశ్వరుడు. ఆయన అరుణాచలం వచ్చినప్పుడు నాకు శాంతిని ప్రసాదించు, మోక్షాన్ని ప్రసాదించు, నాలో ఉన్న అజ్ఞానాన్ని తొలగించు అని ఇటువంటి మాటలు ఏమీ అరుణాచలేశ్వరుడితో రమణస్వామి చెప్పలేదు. ఓ తండ్రీ! నీ ఆజ్ఞననుసరించి నేను ఇక్కడకు వచ్చాను. నా అంతట నేను రాలేదు. నువ్వు రమ్మంటేనే నేను ఇక్కడికి వచ్చాను అని చెప్పాడు. ఏమి ఠీవి అది. ఎంత మెజిస్టిక్‌గా చెప్పాడో చూడండి.

పరమేశ్వరుడికి రూపంలేదు, నామంలేదు. ఎప్పుడు ఏరూపం అవసరమైతే ఆ రూపంతో ఆ నామంతో వస్తాడు. మీకు కనిపించే రూపమే నిజం అనుకోవద్దు. ఈమధ్య మూర్తిగారని ఒక మాష్టారు అరుణాచలం వెళ్ళారు. ఆయన అరుణాచలం నుండి ఒక ఉత్తరం వ్రాసారు. 1987వ సంవత్సరంలో మీరు రమణమహర్షి గురించి నాకు చెప్పారు.